
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
మంగళవారం 27 మే 2025





సభలో మాట్లాడుతున్న భట్టి



ఖానాపూర్‌లో ఎంపీ, ఎమ్మెల్యేతో కలిసి ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

'పాలమూరు– రంగారెడ్డి'ని పూర్తిచేస్తాం

రైతులకు సాగు నీరందిస్తాం

- అభివృద్ధి, సంక్షేమం ఆగదు.. రైజింగ్ తెలంగాణ
- ఏటా సంక్షేమానికి రూ. 70వేల కోట్లు ఖర్చు
- ఫామ్‌హౌజ్‌లో కూర్చొని విమర్శలు చేస్తున్నారు
- గత ప్రభుత్వం రాష్ట్రాన్ని పూర్తిగా దోచేసింది
- బీఆర్ఎస్ దెయ్యాల నుంచి విముక్తి లభించింది
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ఆమనగల్లు, మే26(ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తిచేసి రైతులకు సాగునీరందిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద పెండింగ్‌లో ఉన్న రిజర్వాయర్లకు సంబంధించిన భూసేకరణకు నిధులను వెంటనే విడుదల చేస్తామన్నారు. విపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా, ఎన్ని అడ్డంకులు సృష్టించినా రాష్ట్రంలో అభివృద్ధి ఆగదని, ప్రజాపాలన కొనసాగిస్తామని ఆయన చెప్పారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో రూ.200 కోట్లతో ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు, కల్వకుర్తి నియోజకవర్గంలో రూ.40 కోట్లతో కొత్తగా ఏర్పాటు చేసే ఎనిమిది విద్యుత్ ఉప కేంద్రాలకు సోమవారం నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిలతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో భట్టి మాట్లాడుతూ రాష్ట్రంలో నెలనెలా అప్పులకు రూ.6500 కోట్లు చెల్లిస్తున్నా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మాత్రం కొనసాగిస్తున్నామని చెప్పారు. సంక్షేమ కార్యక్రమాలకు ఏటా రూ.70వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వం దోపిడీకి పాల్పడిందని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్‌కు మనుగడ లేదని ప్రజలకు అర్థమైందన్నారు. బీఆర్ఎస్ దెయ్యాల నుంచి ప్రజలు విముక్తి కోరుకుని కాంగ్రె‌స్‌కు అధికారం కట్టబెట్టారని, తెలంగాణలో కేసీఆర్ ఆటలు ఇక సాగవని ఆయన వ్యాఖ్యానించారు. కేసీఆర్.. నీ చుట్టూ ఉన్న

మిగతా 7వ పేజీలో...

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

» డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ సుగుణబాయి



తేమశాతం చూస్తున్న అధికారులు

ఘట్‌కేసర్ రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): ధాన్యం తడవకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీసీఎంఎస్ డీఎం సుగుణబాయి సూచించారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అంకుశాపూర్‌లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాలు లేకుండా ధాన్యాన్ని శుభ్రం చేసి, తేమశాతం 17కు మించకుండా చూడాలన్నారు. నిబంధనల ప్రకారమే కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 14 ధాన్యం కేంద్రాల్లో 1,682 మంది రైతుల నుంచి 9,287.76 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. లారీల కొరత వల్ల ధాన్యం సేకరణ కొంత ఆలస్యమైతుందని, ఈ సమస్యను అధిగమించి వారంలో ధాన్యాన్ని పూర్తిగా సేకరిస్తామన్నారు. ఆమె వెంట డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ వెంకట్‌రెడ్డి, ఆయా కేంద్రాల ఇన్‌చార్జిలు, రైతులు ఉన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులతో డీఈవో రేణుకాదేవి

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

» డీఈవో రేణుకాదేవి

వికారాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని డీఈవో రేణుకాదేవి అన్నారు. వికారాబాద్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో జిల్లా విద్యాధికారి రేణుకాదేవి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్నివసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారం, ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందిస్తోందని చెప్పారు. కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించారని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అంగన్‌వాడీల నుంచి ఉన్నత పాఠశాల వరకు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి కృషి చేయాలని డీఈవో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బాబు సింగ్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శంషాబాద్‌లో కురుస్తున్న వర్షం

తొలకరి పలకరింపు

రెండు వారాలకు ముందుగానే నైరుతి ఆగమనం

తొలకరిజల్లులు పలకరించాయి. అనుకున్నదానికంటే ముందే నైరుతి రుతుపవనాలు ఉమ్మడి జిల్లాలోకి ప్రవేశించాయి. సాధారణంగా జూన్ మొదటి వారంలో రాష్ట్రంలోకి ప్రవేశించే నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది రెండు వారాలకు ముందుగానే తాకాయి. దీంతో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో సోమవారం సాయంత్రం నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీనికి తోడు అల్పపీడన ప్రభావం కూడా రుతుపవనాల విస్తరణకు దోహదపడుతోంది. మరో మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు పడే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

- ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వర్షాలు
- చందనవెల్లిలో 81.3మి.మీ వర్షపాతం నమోదు
- వ్యవసాయ పనులకు రైతులు సన్నద్ధం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వికారాబాద్‌జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఇదిలా ఉంటే సోమవారం షాబాద్ మండలంలో అత్యధిక వర్షపాతం నమోదైంది. షాబాద్ మండలం చందన్వెల్లిలో అత్యధికంగా 80మి.మీ వర్షపాతం నమోదైంది. మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో 76మి.మీ వర్షం కురిసింది. వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో అత్యధికంగా 35మి.మీ వర్షపాతం నమోదైంది. ఇదిలాఉంటే

మిగతా 7వ పేజీలో...

జిల్లాల్లో వర్షపాతం (మి.మీలలో)

జిల్లా	మండలం	ప్రాంతం	నమోదు
రంగారెడ్డి	షాబాద్	చందనవెల్లి	81.3
	మొయినాబాద్	కేతిరెడ్డిపల్లి	76.0
	మొయినాబాద్	మొయినాబాద్	70.0
	షాబాద్	తాళ్లపల్లి	60.0
వికారాబాద్	కొడంగల్	కొడంగల్	40.5
	వికారాబాద్	మద్గుల్ చిట్టంపల్లి	28.5
	యాలాల	యాలాల	25.0

విత్తనాలు విత్తిన రైతులు

యాచారం మండలంలోని యాచారం, మేడిపల్లి, నందివనపర్తి, చౌదర్‌పల్లి, గున్‌గల్, కొత్తపల్లి గ్రామాలలో రెండు రోజులుగా మోస్తరు భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు సోమవారం పత్తి, జొన్న, బొబ్బర విత్తనాలు విత్తారు.



బషీరాబాద్‌లో మొలకెత్తిన ధాన్యం

వాన.. హైరానా

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- మొలకెత్తిన వడ్ల బస్తాలు
- ఇబ్బందులు పడ్డ అన్నదాతలు

7

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ

వికారాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం జరిగిన ఇంటర్మీడియట్ ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు 242 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఫస్టియర్ పరీక్షలకు 176 మంది గైర్హాజరు కాగా, సెకండియర్ పరీక్షలకు 66 మంది హాజరు కాలేదు. ఫస్టియర్ పరీక్షలకు 2,571 మంది విద్యార్థులకు 2,395 మంది హాజరు కాగా, వారిలో 176 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 2,344 మందికి 2,186 మంది హాజరు కాగా, 158 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 227 మంది విద్యార్థులకు 209 మంది హాజరు కాగా, 18 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెకండియర్ పరీక్షలకు 1,015 మందికి 949 మంది విద్యార్థులు హాజరుకాగా, 66 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 894 మందికి 832 మంది హాజరుకాగా, 62 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 121 మంది విద్యార్థులకు 117 మంది హాజరు కాగా, నలుగురు గైర్హాజరయ్యారు.

29న మెగా జాబ్‌మేళా

బషీరాబాద్, మే 26(ఆంధ్రజ్యోతి): తాండూరులోని వినాయక కన్వెన్షన్‌లో ఈనెల 29న నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌రావు, ఆపార్టీ యువ నాయకులు కొత్వారు మాణిక్‌రావు సోమవారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, ఈజీఎంఎం(ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ మార్కెటింగ్ మిషన్) వారి ఆధ్వర్యంలో జరిగే జాబ్‌మేళాకు 50కి పైగా కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఈ జాబ్ మేళాకు పదోతరగతి, ఇంటర్మీడియట్, ఫార్మసీ, డిగ్రీ, పీజీ, బీటెక్ చదివిన నిరుద్యోగులకు సువర్ణావకాశమన్నారు. మార్కెటింగ్, ఐటీ, బ్యాంకింగ్, నర్సింగ్ తదితర రంగాల్లో 10వేలకు పైగా ఉద్యోగాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ షురూ

52 రోజులపాటు ట్రైనింగ్

» మేడ్చల్ జిల్లాలో 146 మంది..

» వికారాబాద్‌లో 151 మంది ఎంపిక

వికారాబాద్/మేడ్చల్, మే 26(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ సర్వేయర్ల కొరత దృష్ట్యా లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. భూ భారతి చట్టంలో భాగంగా రిజిస్ట్రేషన్ల సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి అనే నిబంధన ఉండటంతో రాష్ట్రంలోని భూములన్నింటినీ సర్వే చేసి మ్యాప్‌లు రూపొందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నెల 17వ తేదీ వరకు లైసెన్స్‌డ్ సర్వేయర్ల నుంచి మీసేవ ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో 146 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన వారికి సోమవారం శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటిరోజు సోమవారం ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. నేటి నుంచి పూర్తిస్థాయిలో శిక్షణ ఉంటుందని, మొత్తం 52 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సర్వేయర్ల శిక్షణా శిబిరాన్ని పరిశీలించి శిక్షణ పొందిన తర్వాత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరిరెడ్డి, సర్వే ఏడీ శ్రీనివాస్, డిప్యూటీ ఐవోస్ బలరాం, సత్యమ్మ, శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న మేడ్చల్ జిల్లా అధికారులు

క్షేత్రస్థాయి నివేదికను అందించాలి

క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే నివేదికను అందజేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం మద్గుల్ చిట్టంపల్లిలోని డీపీఆర్సీ భవనంలో 50 రోజుల పని దినాల్లో లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టానికి అనుగుణంగా భూ సర్వే నిమిత్తం శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మొదటి విడతలో వికారాబాద్ జిల్లాలో 151 మందికి లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. భూ సర్వేలో ఎలాంటి తప్పిదాలకు తావలేకుండా భూసర్వే ప్రక్రియ కొనసాగించేందుకు సరైన శిక్షణను పొందాలని సూచించారు. సర్వేయర్లు భూభారతి చట్టంలో భాగంగా సర్వే చేయాల్సి ఉంటుందని, భూ వివాదాలకు సంబంధించిన భూముల జోలికి వెళ్లకుండా ఉండాలని, ప్రభుత్వ భూములను గుర్తించాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కేశవ్, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఘట్‌కేసర్, మే 26 (ఆంధ్రజ్యోతి): చార్మినార్ జోన్‌లో ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లాల్లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు/ కళాశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు (తాత్కాలిక పద్ధతిన) అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని జోనల్ అధికారి కె.నిర్మల, జిల్లా సమన్వయ అధికారి బి.వేణుగోపాల్ ఒక ప్రకటనలో కోరారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, స్పెషల్ టీచర్స్, హెల్త్ సూపర్‌వైజర్, పీఈటీ, పీడీ, లైబ్రేరియన్ సబ్జెక్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఈ నెల 30న చిలుకూరు బాలుర తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/ కళాశాలలో ఉదయం 8 గంటల నుంచి పాఠ్యాంశ బోధన డెమో నిర్వహిస్తామన్నారు. అలాగే ఈనెల 31న బోటనీ, జువాలజీ, సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్ సబ్జెక్టులకు సంబంధించి డెమో ఉంటుందని తెలిపారు. డెమోకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, సెట్ జిరాక్స్ కాపీలను తీసుకుని రావాలని సూచించారు. బాలికల విద్యాలయాల్లో పనిచేయడానికి మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని చెప్పారు. జూనియర్ లెక్చరర్ వేతనం నెలకు రూ.23,400, పీజీటీ, టీజీటీ ఉపాధ్యాయులకు రూ.18,200 వేతనం ఉంటుందని వారు తెలిపారు.

అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు

» మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



మేడ్చల్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

వికారాబాద్/మేడ్చల్, మే 26(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజావాణికి వచ్చే అర్జీలను పెండింగ్ పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో డీఆర్‌ఓ హరిప్రియతో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ శాఖల్లో ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలన్నారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యమిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 76 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వికారాబాద్: దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

అధికారులు సమయపాలన పాటించాలి

ప్రజావాణికి హాజరయ్యే జిల్లా అధికారులు సమయపాలన పాటించాలని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీవో వాసుచంద్రతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా అధికారులు సమయపాలన పాటిస్తూ సిబ్బంది సైతం కార్యాలయ సమయానికి హాజరయ్యేలా మార్గదర్శకాలు సూచించాలన్నారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిశీలించి సమస్యల సత్వర పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ప్రజావాణిలో రెవెన్యూ, భూసర్వే, పౌరసరఫరాలు, హౌసింగ్, పెన్షన్లు, గ్రామీణ, పోలీస్, పంచాయతీరాజ్‌కు సంబంధించి 125 అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు.



కార్యకర్తలపై దాడి సరికాదు

● బీఆర్‌ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్



వికారాబాద్,మే 26(ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడి చేయడం సరికాదని బీఆర్‌ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ క్యాంపుకార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడిచేయడాన్ని ఆయన తప్పుబట్టారు. అడ్డుకోబోయిన బీఆర్‌ఎస్ కార్యకర్తలపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడాన్ని ఖండించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు గూండాల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గతంలో హరీశ్ రావు క్యాంపు కార్యాలయంపై కూడా దాడి చేశారని గుర్తుచేశారు. నేషనల్ హెరాల్డ్ కేసు నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి, మిస్‌ఇంగ్లాండ్ మిల్లా మాగీ అవమానాన్ని కప్పిపుచ్చడానికి ఇలాంటి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు చేస్తున్న తప్పులను ప్రజలు గమనిస్తున్నారని, తగిన గుణపాఠం చెబుతారని మెతుకు ఆనంద్ హెచ్చరించారు.





హమాలీల కొరత.. జొన్న రైతుల అవస్థ

మర్పల్లి, మే26 (ఆంధ్రజ్యోతి) : జొన్నల కొనుగోలు కేంద్రం దగ్గర హమాలీల కొరతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మర్పల్లి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కేంద్రానికి మర్పల్లి, బంటారం, మోమిన్‌పేట్, ధారూర్, కోట్‌పల్లి, వికారాబాద్ మండలాల నుంచి రైతులు జొన్న పంటను తీసుకువస్తున్నారు. కేంద్రం దగ్గర 15 మందే హమాలీలు ఉండటంతో తూకం సక్రమంగా జరగడం లేదు. ఓ వైపు అకాల వర్షాలు, మరో వైపు సకాలంలో తూకాలు జరగక పోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. రైతులు పెద్దఎత్తున తరలి రావడంతో నిల్వ చేసేందుకు సరైన గోదాం లేక ట్రాక్టర్లు, రోడ్లపై నిల్వ చేసుకుంటున్నారు. వర్షానికి ధాన్యం తడిస్తే కొనుగోలు చేస్తారో లేదోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హమాలీల సంఖ్యను పెంచి తూకాలు వెంటవెంటనే చేపట్టాలని కోరుతున్నారు.


జొన్న కొనుగోలు కేంద్రం వద్ద బస్తాలు దించుకుంటున్న రైతులు


మార్కెట్ యార్డు వద్ద ధర్నాలో బీజేపీ నాయకులు, రైతులు

ధాన్యం కొనుగోలు చేసి ఆదుకోవాలి

ఆమనగల్లు, మే 26(ఆంధ్రజ్యోతి): వర్షాలకు తడిసిన వడ్లను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి డిమాండ్ చేశారు. కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని సకాలంలో తూకం వేయకే తడిసి రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమనగల్లులోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో సోమవారం తడిసిన వడ్లను బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం యార్డ్ ఆఫీసు వద్ద ధర్నా చేపట్టారు. ఆచారి మాట్లాడుతూ.. ప్రభుత్వం నామమాత్రంగా కొనుగోలు చేస్తూ రైతులకు ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. రైతులు వారాల తరబడి కొనుగోలు కేంద్రాల వద్దే ఉంటున్నా చివరకు ధాన్యం తడిసి నష్టపోతున్నారని అన్నారు. ఆందోళన చేస్తున్న రైతులపై పోలీసుల దాడి సరికాదన్నారు. ప్రభుత్వం వడ్లను కొనకుంటే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కండె హరిప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాంపాల్‌నాయక్, మాజీ వైస్‌చైర్మన్ దుర్గయ్య, మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పద్మఅనిల్, లక్ష్మణ్, భగీరథ్, మహేశ్, శ్రీధర్, చెన్నకేశవులు, పెద్దయ్య, రెడ్యనాయక్, మహేశ్, బక్కి కుమార్, వగ్గు ప్రభాకర్, అమర్‌సింగ్, భగవాన్‌రెడ్డి, నారాయణరెడ్డి, లక్యనాయక్, డి.శ్రీనివాస్, డి.మహేశ్, రాందాస్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత జీవితం


మదర్సాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

తలకొండపల్లి, మే 26(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉన్నత జీవితం లభిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఎక్కువ మంది విద్యాధికులున్న ప్రాంతాలే వేగవంతంగా అభివృద్ధి చెందుతాయన్నారు. ఖానాపూర్‌లో సోమవారం మదర్సాను ముస్లిం నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. మదర్సాలో విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్న మౌలానా అబ్దుల్ కరీం షాఖాద్రీని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, వెంకట్‌రెడ్డి, షాబుద్దీన్, హఫీజ్ పాల్గొన్నారు.

మహేశ్వరం ఏసీపీగా జానకిరెడ్డి బాధ్యతల స్వీకరణ



మహేశ్వరం, మే 26(ఆంధ్రజ్యోతి): ఏసీపీల బదిలీల్లో భాగంగా మహేశ్వరం ఏసీపీగా ఇప్పటి వరకు విధులు నిర్వహించిన లక్ష్మీకాంత్‌రెడ్డిని ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన స్థానంలో హెచ్‌ఎండీఏ పరిధిలో డీఎస్పీగా పనిచేస్తున్న ఎస్.జానకిరెడ్డిని మహేశ్వరం ఏసీపీగా నియామకమయ్యారు. సోమవారం ఆయన ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. జోన్ పరిధిలో ప్రజల సహాయ సహకారాలతో నేరాల నియంత్రణకు ప్రాధాన్యం ఇస్తామన్నారు.

గర్భిణులకు మెడికల్ కిట్ల పంపిణీ

తలకొండపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): చెన్నంపల్లి, వెంకటాపూర్, మాదాయిపల్లి గ్రామాల్లో సోమవారం గర్భిణులకు మెడికల్ కిట్ల పంపిణీ చేశారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ట్రస్ట్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ కిట్లను సమకూర్చారు. ఆశా కార్యకర్తలు, బీఆర్‌ఎస్ నాయకులు వాటిని పంపిణీ చేశారు. వెంకటేశ్‌ను నాయకులు అభినందించారు. కార్యక్రమంలో నిరంజన్, వెంకటయ్య, మల్లేశ్, అంజయ్య, శేఖర్, బాషా, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

కళాశాల భవనానికి రూ.11లక్షల విరాళం

షాద్‌నగర్ అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామ శివారులో ఉన్న దేవశ్రీ ఇస్పాత్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్‌గోయాంక భారీ విరాళం ఇచ్చారు. సోమవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్‌కు రూ.11లక్షల చెక్కును ఆయన అందజేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని దాతల సహకారంతో భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని, తన వంతు సహకారంగా విరాళం ఇచ్చానని గోయాంక తెలిపారు. భవన నిర్మాణానికి విరాళం ఇచ్చిన ప్రకాశ్‌గోయాంకకు, సహకారం అందించిన మోముల బసప్పకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.


ఎమ్మెల్యే శంకర్‌కు విరాళం అందజేస్తున్న ప్రకాశ్ గోయాంక

నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే శంకర్ పరిశీలించారు. రెండు స్లాబ్‌లు పూర్తయి గోడల పనులు ప్రారంభమయ్యాయి. ఎప్పటికప్పుడు నిర్మాణ పనులను పర్యవేక్షించాలని కాంగ్రెస్ నాయకులకు, ఇంజినీర్లకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, అగ్గనూరి బస్వం, శ్రీకాంత్‌రెడ్డి, జి.బాల్‌రాజ్‌గౌడ్, ఎర్రోల్ల అశోక్, కృష్ణ, ముబారక్ అలీ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో సాగు చేయాలి

శంషాబాద్ రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): రైతులు రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులతో పంటలను సాగుచేయాలని శాస్త్రవేత్తలు సుకృత్‌కుమార్, మహదేవప్ప అన్నారు. సోమవారం రామాంజపూర్‌లో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులపై వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు శ్వేత, సురేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగులో మెలకువలు పాటించాలి


చేవెళ్ల: వ్యవసాయంలో మెలకువలు పాటిస్తే చీడపీడల ఉధృతి తగ్గడంతో పాటు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రగతి కుమారి తెలిపారు. ఇలా చేస్తే మంచి దిగుబడి సాధిస్తామన్నారు. సోమవారం అల్లావాడలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్త మాట్లాడుతూ.. రైతులు భూసార పరీక్షలు తప్పక చేయించి సూచించిన మోతాదులోనే ఎరువులు వాడాలన్నారు. సేంద్రియ వ్యవసాయం పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏవో శంకర్‌లాల్, ఏఈవో స్వాతి, రైతులు ఉన్నారు.

క్రిమి సంహారక మందుల వాడకం తగ్గించాలి

ఇబ్రహీంపట్నం/ఆదిభట్ల: రైతులు పంట సాగులో రసాయన మందుల వాడకాన్ని తగ్గించాలని ప్రొ.జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు బి.పద్మజ, రాంప్రకాశ్ సూచించారు. ఇబ్రహీంపట్నం మండలం తుర్కగూడ, నాగన్‌పల్లి గ్రామాల్లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. రైతులు సాగులో యూరియా, ఎరువులు, పురుగు, కలుపు నివారణ మందులను తక్కువ మోతాదులో వాడాలని తెలిపారు. ఆరుతడి పంటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రజనీకాంత్, అరుణశ్రీ, ఇబ్రహీంపట్నం ఏవో విద్యాధరి, ఏఈవోలు శ్రావణ్‌కుమార్, సృజన, పంచాయితీ కార్యదర్శులు సంపత్, మమత, నాయకులు, రైతులు జగన్, యాదగిరి రెడ్డి, వెంకట్‌రెడ్డి, బాల్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త ప్రగతికుమారి


రైతు సదస్సుల్లో మాట్లాడుతున్న శాస్త్రవేత్త







ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

కులకచర్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక రైతు వేదికలో సోమవారం ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. మండలానికి 391 మందిని పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లకు అర్హులుగా ఎంపిక చేసి ప్రొసిడింగ్‌లు అందించినట్లు తెలిపారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని సూచించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతీ హామీని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య, పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి, సత్యమ్మ, భరత్‌కుమార్, గోపాల్‌నాయక్, రవినాయక్ పాల్గొన్నారు.


ప్రొసీడింగ్ అందిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

'పాలమూరు-రంగారెడ్డి'ని పూర్తిచేస్తాం

(ఐదో పేజీ తరువాయి)

దెయ్యాలతో జాగ్రత్త అని ఎద్దేవా చేశారు. ఫామ్ హౌజ్‌లో కూర్చొని అప్పుడప్పుడు బయటకు వచ్చే నేతలు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని అరెస్టులు, నిర్బంధాలు కొనసాగాయని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో ఇందిరమ్మ పాలన వచ్చిందని ఆయన చెప్పారు. ప్రజా పాలనలో సంపదను సృష్టించి ప్రజలకు పంచిపెడుతున్నట్లు ఆయన తెలిపారు. రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని, 132కేవీ సబ్‌స్టేషన్ మంజూరు చేస్తున్నామని ఆయన ప్రకటించారు. అదేవిధంగా కల్వకుర్తిలో ఇందిర సౌర గిరి జలవికాస పథకం అమలు చేస్తామని ఆయన చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సాగునీటి ప్రాజెక్టులు నిర్మించిందని ఆయన గుర్తు చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రాధాన్యత క్రమంలో నిధులు కేటాయించి పూర్తి చేస్తామని, రైతులందరికీ సాగునీరందిస్తామని డిప్యూటీ సీఎం చెప్పారు.



సభలో పాల్గొన్న నాయకులు, ప్రజలు

నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్‌మల్లు రవి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కారానికి అవసరమైన సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కేటాయించడం జరిగిందని చెప్పారు. మతిభ్రమించి కేటీఆర్ విమర్శలు చేస్తున్నారని, ఇకముందు అలా చేస్తే కార్యకర్తలు తగు రీతిలో సమాధానం చెబుతారని వారు హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తికి సాగు నీరందించేందుకు పాలమూరు - రంగారెడ్డి ఎత్తి పోతల పథకాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి 132 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు.

కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక సారధి చైర్మన్ గుమ్మడి వెన్నెల, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబెదుల్లా కొత్వాల్, వనపర్తి ఎమ్మెల్యే మెగారెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, కలెక్టర్ నారాయణ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్దన్ రెడ్డి, రాష్ట్ర టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, రాష్ట్ర విద్య సంక్షేమ,మౌళిక సదుపాయాల కల్పన ఎండీ గణపతి రెడ్డి, విద్యుత్ శాఖ డైరెక్టర్ నందగోపాల్,



భట్టి విక్రమార్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి

సీఈ పాండయ్య, ఎస్ఈ రామ్మోహన్, ఏడీఈ బాలకృష్ణ, ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ్మ, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గట్లు కేశవ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, పీసీసీ కార్యదర్శి రాంరెడ్డి, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సుజాతరెడ్డి

నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలి

యాచారం, మే 26(ఆంధ్రజ్యోతి): ఐఎస్ఐ నాణ్యతున్న ఎరువులు విత్తనాలనే డీలర్లు విక్రయించాలని ఇబ్రహీంపట్నం డివిజన్ వ్యవసాయాధికారిణి సుజాతరెడ్డి ఆదేశించారు. సోమవారం యాచారం రైతు వేదికలో ఎరువులు, విత్తన డీలర్ల సమావేశంలో మాట్లాడారు. రోజూ స్టాక్ రిజిష్టర్ మెయింటేన్ చేయాలన్నారు. ఏ వస్తువు కొన్నా రైతుకు విధిగా బిల్లులు ఇవ్వాలన్నారు. ఎక్స్‌పైర్డ్ రసాయనాలు, విత్తనాలు అమ్మొద్దని చెప్పారు. ఎరువులను ఈపాస్ ద్వారానే విక్రయించాలన్నారు. గ్లైఫోసెట్ క్రిమిసంహారక మందును ప్రభుత్వం నిషేధించిందన్నారు. నకిలీ పత్తి విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సత్యనారాయణ హెచ్చరించారు. సమావేశంలో ఏవో రవినాథ్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



మన్‌సాన్‌పల్లిలో దుకాణాలను తనిఖీ చేస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

మహేశ్వరం, మే 26(ఆంధ్రజ్యోతి): నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయించే వారికి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మహేశ్వరం సీఐ హెచ్.వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం వ్యవసాయాధికారులతో కలిసి మన్‌సాన్‌పల్లి చౌరస్తా, అమీర్‌పేట గ్రామాల్లో ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు కష్టపడి వ్యవసాయం చేస్తుంటారని, అలాంటి వారిని నకిలీలతో మోసం చేయొద్దన్నారు. అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏవో నాగమణి పాల్గొన్నారు.

కడ్తాల అభివృద్ధికి ప్రత్యేక నిధులివ్వండి



కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి, ఎంపీ రవి

కడ్తాల్, మే26(ఆంధ్రజ్యోతి):కడ్తాల మండల అభివృద్ధికి ప్రభుత్వపరంగా సహకరించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిలను కడ్తాల మండలం కాంగ్రెస్ నాయకులు కోరారు. కడ్తాలలో మండల పరిషత్ నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేయాలని కోరారు. సోమవారం హైదరాబాద్ నుంచి అచ్చంపేటకు వెళ్తూ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిలు కడ్తాలలో కొద్ది సేపు ఆగారు. కాంగ్రెస్ పార్టీ నాయకులతో వారు సమావేశ మయ్యారు. డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మంత్రికి వినతిపత్ర మందజేశారు. కడ్తాలలో 30పడకల ఆరోగ్య కేంద్రం, 108అంబులెన్స్‌లను ఏర్పాటు చేయాలని, మండలానికి వెయ్యి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు యాట నర్సింహ, బిచ్యా నాయక్, హన్మానాయక్, వెంకటేశ్, బిక్యానాయక్, లక్ష్మయ్య, అశోక్, లక్పతి, హీరాసింగ్, బోసు రవి, రాజేశ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్పస్వామి కల్యాణం

యాచారం, మే 26 (ఆంధ్రజ్యోతి): మల్కీజ్‌గూడలో సోమవారం బీరప్పకామరాతీదేవీల కల్యాణాన్ని కురుమలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవంలో వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు. స్వామి కల్యాణం అనంతరం గొర్లుమేకల మందపై బలి వేసుకున్నారు. బోనంలోని పదార్థాలను మందలపై చల్లుకున్నారు. ఉత్సవంలో బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్, నాయకుడు బాషా పూజలు చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



తుమ్మలూరులో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

భూసార పరీక్షలు తప్పక చేయించాలి

మహేశ్వరం, మే 26(ఆంధ్రజ్యోతి): రైతులు భూసార పరీక్షలు తప్పక చేయించాలని, అలాగే పంట మార్పిడి విధానాన్ని పాటించాలని తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ అగ్రానమీ శాస్త్రవేత్త రామాంజనేయులు అన్నారు. సోమవారం తుమ్మలూరులో శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. రైతులు వర్షాధార పంటలకు ముందుగా పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకోవాలన్నారు. యూరియా వాడకం తగ్గించాలన్నారు. పొటాష్ ఎరువు ప్రయోజనాలను వివరించారు. కూరగాయల సాగులో డ్రిప్, స్ప్రింక్లర్, మల్చింగ్ విధానాన్ని పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏవో నాగమణి, తుమ్మలూరు మాజీ సర్పంచ్ మద్దికరుణాకర్‌రెడ్డి, రైతులు తధితరులు పాల్గొన్నారు.

వాన.. హైరానా

కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

- మొలకెత్తిన వడ్లు
- ఇబ్బందులు పడిన అన్నదాతలు



కోట్‌పల్లి: మొక్కజొన్నలపై తాడిపత్రి కప్పిన రైతు

బషీరాబాద్/కులకచర్ల/తాండూరు/ధారూరు/కొడంగల్/కోట్‌పల్లి/దోమ/బొంరాస్‌పేట్/పరిగి, మే 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. సోమవారం పలుచోట్ల మోస్తరు వర్షం కురవగా, మరికొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. బషీరాబాద్ మండలంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిముద్దయ్యింది. పలువురి ధాన్యపురాశుడు నీటిలో మునిగిపోయాయి. బషీరాబాద్ కొనుగోలు కేంద్రం వర్షపు నీటితో చెరువును తలపించింది. కొందరి ధాన్యం బస్తాలు తడిసి మొలకెత్తాయి. సకాలంలో తూకాలు వేయకనే తరుచూ వస్తున్న వర్షాలతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థల భావంతో స్థానిక అయ్యప్ప ఆలయం ఆవరణలో కొనుగోళ్లు చేస్తున్నారు. భారీగా ధాన్యం వస్తుండడంతో కొనుగోళ్లలో జాప్యం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైసు మిల్లులకు తరలించకపోవడంతో ధాన్యం బస్తాలు తడిసిపోయాయని పలువురు రైతులు ఆరోపించారు. మండల వ్యాప్తంగా కాశీంపూర్, దామర్‌చెడ్, మైల్వార్, నవాంద్గీ, నవాల్గలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరిస్తున్నారు. అయితే కేంద్రాలకు వచ్చే ధాన్యానికి సరిపోను టార్పలిన్లు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

కొనుగోళ్లలో జాప్యం

కులకచర్ల మండలంలోని తిరుమలాపూర్, ముజాహిద్‌పూర్ కేంద్రాల్లో తూకం వేయని, వేసిన ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. కొన్ని బస్తాలు మెలకెత్తాయి. వడ్లను తూకం వేయడం, మిల్లులకు తరలించడంలో జాప్యం జరగడంతో ధాన్యం తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కులకచర్ల మండలంలోని 15 పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరత వెంటాడుతోంది. మొత్తం 20 లారీల ధాన్యం మిల్లలకు తరలించేందుకు సిద్ధంగా ఉంది. సెర్ప్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మూడు కేంద్రాల్లో ఆరు లారీల ధాన్యం నిల్వలున్నాయి.

కోట్‌పల్లిలో జల్లులు

కోట్‌పల్లి: మండల పరిధిలో చిరుజల్లులు పడ్డాయి. మొక్కజొన్న ఎండబెట్టేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. తరుచూ వస్తున్న వానతో పంట పూర్తిగా ఎండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాండూరులో..

తాండూరు: తాండూరు మండల పరిధిలో సోమవారం మోస్తరు వర్షం కురిసింది. తాండూరు పట్టణంలో కురిసిన వర్షానికి మురుగుకాలువలు నిండి పారాయి. శివారు ప్రాంతాల్లోని కాలనీలు రోడ్లు జలమయమయ్యాయి. చిరువ్యాపారులు వర్షంతో ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని పలుప్రాంతాల్లో ఈదురుగాలులకు చెట్లు విరిగిపడ్డాయి.

ధారూరులో మోస్తారు వర్షం

ధారూరు: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మబ్బుపట్టి ఉండి వర్షం కురిసింది.

కొడంగల్‌లో..

కొడంగల్ మండల పరిధిలో సోమవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వర్షపు నీరు పంట పొలాల్లో చేరడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. కొడంగల్ మండలంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల దగ్గర రైతులు నిల్వ ఉంచిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. తరచూ కురుస్తున్న వర్షాలతో తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు.

తడిసి ముద్దవుతున్న ధాన్యం

పరిగి మండల పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకాలు వేయడంలో జాప్యం జరుగడంతో ధాన్యం నిల్వలు పెరుకుపోతున్నాయి. ఆదివారం, సోమవారం కురిసిన వర్షాలతో ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. రైతులు తాడిపత్రిలు కప్పినప్పటికీ తడిసిపోయాయని వాపోయారు. సుల్తాన్‌పూర్, రంగంపల్లి, మిట్టకోడూరు, గడిసింగాపూర్ తదితర గ్రామాల్లో వర్షాలతో రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. పరిగి మండలం సుల్తాన్‌పూర్‌లో ధాన్యం మొలక వచ్చింది. దోమ మండల కేంద్రంతోపాటు 14 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో లారీలు, గన్నీ బ్యాగులు రాకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. తరుచూ కురుస్తున్న వర్షాలకు ధాన్యంపై టార్పలిన్లు కప్పి పడిగాపులు కాస్తున్నారు.

వెంటాడుతున్న వానలు

బొంరాస్‌పేట్ మండలంలో కురిసిన వర్షానికి ధాన్యం తడిసిముద్దయ్యింది. అధికారులు కేంద్రాలను సందర్శించడమే తప్ప కొనుగోళ్లను వేగవంతం చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. బొంరాస్‌పేట్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్ ఇతర అధికారులు సందర్శించినా ధాన్యం మిల్లర్లకు చేరడం లేదు. బొంరాస్‌పేట్ మండలంలో లారీలు సరిగా రాక సోమవారానికి ఏడు వేల బస్తాల వరకు తూకం వేసిన ధాన్యం ఆరుబయట ఉంది. మిల్లుల ట్యాగింగ్ కూడా సరిగా చేయకపోవడంతో ధాన్యం కేంద్రాల దగ్గరే ఉండటంతో రైతులు దిగాలు చెందుతున్నారు.



సుల్తాన్‌పూర్ కొనుగోలు కేంద్రం వద్ద వర్షానికి తడిసిన ధాన్యం



బొంరాస్‌పేట్‌లో లారీలు రాక పేరుకుపోయిన ధాన్యం నిల్వలు



స్వామి వారి పల్లకి ఊరేగింపు

ముగిసిన రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు

షాద్‌నగర్ రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్దలోని రంగధాములలో వెలిసిన గోదా రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. ఉదయం సుప్రభాత సేవ, నిత్యారాధన, మహా పూర్ణాహుతి కార్యక్రమాలానంతరం చక్రతీర్థం నిర్వహించారు. స్వామికి అభిషేకం చేయించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేస్తున్న దళిత నాయకులు

నాగారాన్ని ఎస్సీలకు రిజర్వ్ చేయాలి

ధారూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి ఎన్నికల్లో తమకు పోటీచేసే అవకాశం కలగలేదని, రానున్న స్థానిక ఎన్నికల్లో తమ గ్రామాన్ని ఎస్సీలకు రిజర్వేషన్ చేయాలని మండల పరిధిలోని నాగారం గ్రామ దళిత నాయకులు కోరారు. వారు సోమవారం రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కకు, రాష్ట్ర ఎన్నికల అధికారికి వినతిపత్రం అందజేశారు. తమ గ్రామంలో 1500 జనాభా ఉండగా ఎస్సీల జనాభా 400ల వరకు ఉంటుందని వివరించారు. ఈ విషయంలో మంత్రి సీతక్క, ఎన్నికల కమీషన్ అధికారులు సానుకూలంగా స్పందించారని, జిల్లా కలెక్టర్‌తో విచారణ చేయించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని దళిత నాయకులు తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో దళిత నాయకులు సుకుమార్, ఏనుగుల శ్రీనివాస్, నాగరాజ్, గణేష్, లక్ష్మణ్‌లు ఉన్నారు.

తొలకరి పలకరింపు

(ఐదో పేజీ తరువాయి)

ఈ వానాకాలం (ఖరీఫ్) సీజన్‌లో రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 3.47లక్షల ఎకరాల్లో రైతులతో వివిధ పంటలసాగు చేయించేందుకు వ్యవసాయశాఖ ప్రణాళికను రూపొందించింది. గత ఏడాదితో పోలిస్తే వరి సాగు పెంచగా పత్తి సాగు గణనీయంగా తగ్గించారు. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో 1,40,238 ఎకరాల వరి సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. వరి సన్నాలకు ప్రభుత్వం రూ.500 ప్రోత్సాహకం ఇవ్వడంతో గత వానాకాలం, యాసంగి సీజన్‌లో రైతులు అంచనాలకు మించి వరి పంట వేశారు. దీంతో ఈ ఏడాది వానాకాలం వ్యవసాయ ప్రణాళికలో వరి సాగు లక్ష్యం గతం కంటే పెంచారు. పత్తి సాగు లక్ష్యాలను ఈ ఏడాది తగ్గించారు. ఈ వానాకాలం సీజన్‌లో పత్తి 1,29,088 ఎకరాలకు పరిమితం చేశారు.

రైతులు సన్నద్ధం

ఈ ఏడాది ముందే రుతుపవనాలు రావడంతో రైతులు వ్యవసాయ పనులకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే కొందరు దుక్కులు దున్ని తొలకరికి విత్తనాలు జల్లేందుకు సిద్ధమవుతున్నారు. విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేస్తున్నారు. ఈఏడాది ముందే వర్షాలు రావడంతో రైతులు కూడా సంతోషపడుతున్నారు. మరోవైపు అధికార యంత్రాంగం కూడా రైతులకు ఎరువులు, విత్తనాలు సిద్ధం చేశాయి. అయితే ముందుగానే రుతుపవనాల రాకతో ప్రభుత్వ అంచనాలన్నీ తలకిందులయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వానాకాలం సీజన్‌కు సంబంధించి విత్తనాలు, ఎరువులను ఇంకా పూర్తిస్థాయిలో సమకూర్చలేదు. రుతుపవనాలు రెండు వారాలు ముందుగానే రావడంతో రైతులంతా ఒకే సారి వ్యవసాయ పనులు మొదలు పెడితే విత్తనాలకు పెద్ద ఇబ్బంది లేకున్నా ఎరువుల కొరత వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాస్తవానికి ఈ ఏడాది ముందుగానే అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ఎరువులు డీలర్లు, మార్క్‌ఫెడ్ వద్ద అందుబాటులో ఉన్న ఎరువుల నిల్వలను తనిఖీ చేస్తున్నారు. సొసైటీలు, డీలర్లు వద్ద డీఏపీ, యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువుల లభ్యతపై ఆరా తీస్తున్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి వ్యవసాయ అధికారులు రోజు వారీ పర్యటించి తమ పరిధిలో ఉన్న డీలర్ల దగ్గర ఎరువుల నిల్వలను తనిఖీ చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నారు. అయితే ఎరువులు మాత్రం ఇంకా పూర్తిస్థాయిలో నిల్వలు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది కూడా డీఏపీ నిల్వలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. డీఏపీ స్థానంలో కాంప్లెక్స్ ఎరువులు వాడుకోవచ్చని అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

శంషాబాద్‌లో మోస్తరు వర్షం

శంషాబాద్ : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో సోమవారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. బస్టాండు పరిసర ప్రాంతాల్లో వర్షం నీరు నిలవడంతో ప్రయాణికులు, కూరగాయల మార్కెట్‌కు వచ్చిన రైతులు, కొనుగోలు దారులు ఇబ్బంది పడ్డారు.

సమాధులు కూల్చారని కలెక్టర్‌కు ఫిర్యాదు

ఆదిభట్ల, మే 26(ఆంధ్రజ్యోతి): 40ఏడ్లుగా ఉన్న సమాధులను కూల్చిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కొంగరకలాన్‌కు చెందిన బుడగ జంగాలు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆదిభట్ల పరిధి కొంగరకలాన్, ఫిరోజ్‌గూడల్లోని దాతర్ చెరువు పక్కన 40ఏళ్ల నుంచి బుడగ జంగాల కుటుంబీకులు అంత్యక్రియలు నిర్వహిస్తూ సమాధులు కట్టుకున్నారు. ఆదివారం రాత్రి చెరువు సమీపంలోని సమాధులను కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూల్చివేశారని తెలిపారు. చెరువు కట్టనూ తొలిగించారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో వానరాసి అంజయ్య, జంగయ్య, అంజమ్మ, యాదయ్య, రమేష్, శ్రీనివాస్ ఉన్నారు.

చివరి చూపునకు అవకాశం ఇవ్వండి

మావోయిస్టు భూమిక తల్లిదండ్రుల వేడుకోలు



మృతదేహం కోసం ఎదురు చూస్తున్న భూమిక బంధువులు

షాద్‌నగర్/కేశంపేట మే 26(ఆంధ్యజ్యోతి): పోలీస్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు భూమిక(విజయలక్ష్మి) మృతదేహాన్ని ఆమె తల్లితండ్రులకు అప్పగించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇది ఇలా ఉంటే షాద్‌నగర్‌లో ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నిబంధనలను ఉల్లఘిస్తోందని అన్నారు. భూమిక మృతదేహాన్ని అప్పగించాలని డిమాండ్ చేశారు. తమ కూతురి మృతదేహాన్ని అప్పగించాలని కోరుతూ ఛత్తీస్‌గఢ్ వెళ్లిన భూమిక తల్లితండ్రులకు బాడీ కుళ్లిపోయిందని, అప్పగించలేమని పోలీసులు తెలిపారని భూమిక తల్లితండ్రులు ఫోన్ ద్వారా ఇక్కడికి సమాచారం ఇచ్చారు. కనీసం తమ కూతురికి అంత్యక్రియలు చేసే అవకాశం కల్పించాలని భూమిక తల్లితండ్రులుచ బంధువులు పోలీసులను వేడుకుంటున్నారు. దానికీ అంగీకరించ లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో చర్చించి జరిపి తమ బిడ్డను కడసారి చూసి దహన సంస్కారాలు నిర్వహించే అవకాశం కల్పించాలని భూమిక తల్లితండ్రులు కోరారు.


కూలిన పశువైద్యశాల ప్రహరీ, విరిగిపడిన గేటు

ప్రహరీ కూలి.. గేటు విరిగి..

ధారూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): ధారూరు పశువైద్యశాల ప్రహరీతో పాటు గేటుకూలి కిందపడిపోయాయి. దాదాపు మూడు సంవత్సరాలుగా పడిపోయిన ప్రహరీ, గేటు అలాగే వదిలేశారు. పశువైద్యశాలకు వచ్చిన ఓ వాహనం ప్రహరీని ఢీకొనటంతో ఒక వైపు ప్రహరీ కూలింది. మరోవైపు గేటు విరిగిపోయింది. ఇంతవరకు ఈ ప్రహరీ నిర్మాణం, గేటు పునరుద్ధరణ చేపట్టలేదు. దీంతో ప్రహరీగేటుకు తాళం వేయడానికి వీలులేకుండా పోయింది. పశువైద్యశాల అధికారి, సిబ్బంది విధులు ముగించుకుని వెళ్తున్నారే గానీ ఈ ప్రహరీ, గేటు గురించి పట్టించుకోవడమే మానేశారని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా మరమ్మతులు చేయించాలని అధికారులను కోరుతున్నారు.

అధ్వానంగా మెయిన్‌రోడ్డు

- ప్రమాదకరంగా స్పీడ్ బ్రేకర్
- రోడ్డంతా గుంతలమయం
- పట్టించుకోని అధికారులు

శామీర్‌పేట, మే 26 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట గ్రామంలోని బస్సులు వెళ్లే మెయిన్ రోడ్డు అధ్వానంగా మారింది. ముఖ్యంగా మెడికల్‌షాపు సమీపంలో రోడ్డుపై మామూలు ఎత్తు కంటే ఎక్కువ ఎత్తుగా స్పీడ్ బ్రేకర్‌ను వేశారు. ఈ స్పీడ్‌బ్రేకర్ ఒకవైపు సగభాగం పగిలిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో ద్విచక్ర వాహనదారులకు గండంగా మారింది. నిత్యం వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పలువురు తీవ్రగాయాలపాలైన ఘటనలు ఉన్నాయి.


గుంతలమయంగా మెయిన్‌రోడ్డు, స్పీడ్ బ్రేకర్

చోద్యం చూస్తున్న అధికారులు

మెయిన్‌రోడ్డు గుంతలమయమైనా, సగం పగిలిన స్పీడ్ బ్రేకర్ వల్ల ద్విచక్రవాహనదారులు ప్రమాదానికి గురవుతున్నా సంబంధిత తూంకుంట మున్సిపల్ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా గుంతలను పూడ్చి స్పీడ్ బ్రేకర్‌ను పరిశీలించి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. లేదంటే కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ధర్నా చేస్తామని వాహనదారులు హెచ్చరిస్తున్నారు.

స్పీడ్ బ్రేకర్ ప్రమాదకరంగా ఉంది



శామీర్‌పేటలోని మెయిన్‌రోడ్డులో స్పీడ్‌బ్రేకర్ ప్రమాదకరంగా ఉంది. గ్రామంలోని మెయిన్ రోడ్డు ఏడాదిగా అనేక గుంతలు పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా రోడ్డు మరమ్మతులు చేసి స్పీడ్ బ్రేకర్‌ను తొలగించాలి.

- దేశబోయిన సత్యనారాయణ, గ్రామస్తుడు


శామీర్‌పేటలో ప్రమాదకరంగా మారిన స్పీడ్ బ్రేకర్

ప్రమాదకర స్పీడ్ బ్రేకర్‌ను తొలగిస్తాం

శామీర్‌పేటలో మెయిన్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్ వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. వెంటనే పరిశీలించి దాన్ని తొలగించి రోడ్డు ప్రమాదాలను నివారించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

- తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్

పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం


సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్ టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదలకు కార్పొరేట్‌స్థాయి వైద్యం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే మల్లారెడ్డి తెలిపారు. అత్వేల్లికి చెందిన లక్ష్మణ్‌కు మంజూరైన రూ.85,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మేడ్చల్ పట్టణ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్, మండల రవి, మండల ఈశ్వరయ్య, దేవరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల ఏర్పాటు


తాండూరు రూరల్: గౌతాపూర్ గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు

బషీరాబాద్, మే 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ-కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన మైల్వార్ వద్ద బషీరాబాద్ పోలీసులు సోమవారం చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశానుసారం వచ్చే నెల 7న బక్రీద్ పండగను పురస్కరించుకొని పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు నిఘా కట్టుదిట్టం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ చెక్‌పోస్టును బషీరాబాద్ ఎస్ఐ వి.శంకర్ తనిఖీ చేసి పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాత్రీ పగలు తేడా లేకుండా నిఘా ముమ్మరం చేయాలన్నారు.

తాండూరు రూరల్: మండలంలోని గౌతాపూర్ దగ్గర సోమవారం పోలీసులు ముందస్తుగా చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. ఎస్ఐ విట్టల్‌రెడ్డి మాట్లాడుతూ కర్ణాటక ప్రాంతంలోని మిరియాన్, కల్లూర్, చిన్‌పల్లి తదితర ప్రాంతాల నుంచి పశువులను తరలించకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎవరైనా పశువులను తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య


మోమిన్‌పేట్: బడిబాట కార్యక్రమంలో ఎంఈవో మల్లేశం, ఉపాధ్యాయులు


బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు

మోమిన్‌పేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని ఎంఈవో మల్లేశం అన్నారు. మండలంలోని వెల్చాల్‌లో సోమవారం ఉపాధ్యాయులతో కలిసి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలపై అవగాహన కల్పించారు. పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులతో పాటు నాణ్యమైన విద్యాబోధన అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతోష్, సంగమేశ్వర్, నరేశ్, అనురాధ, జ్యోతి, విద్యా కమిటీ చైర్‌పర్సన్ జమున, కారోబార్ నర్సింహులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: ప్రొఫెసర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా జినుగుర్తిలో సోమవారం ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు, ప్రజలతో కలిసి గ్రామంలో ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు రామలింగారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ అజ్మత్‌అలీ, శ్రీ రామలింగేశ్వరాలయం మాజీ చైర్మన్ ప్రవీణ్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింహులు, హెచ్‌ఎంలు నాగప్ప, సీఆర్పీ దేవయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చౌడాపూర్: మండల కేంద్రంలో ఎంఈవో రాంచందర్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: చిట్లపల్లిలో జయ శంకర్ బడిబాటలో భాగంగా సోమవారం ప్రధానోపాధ్యాయుడు యాదగిరి , ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పిల్లల తల్లి దండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోవర్ధన్, లక్ష్మి, నాగప్ప, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధారూరు: బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ధారూరు జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ధారూరులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వబడుల్లో పాఠ్య, నోట్‌పుస్తకాలు, యూనీఫాం విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ, మహిళా పొదుపు సంఘ సమాఖ్య లీడర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుద్యాల: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ నిర్వహించినట్లు ఎంఈవో విజయరామారావు తెలిపారు. గ్రామపెద్దల సమక్షంలో సోమవారం దుద్యాల మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మెరుగు వెంకటయ్య, మాజీ సర్పంచ్ ఖాజమీయ, కృష్ణ, కలిగే రాములు, ప్రధానోపాధ్యాయుడు చందర్‌నాయక్ పాల్గొన్నారు.

చినుకుపడితే చిత్తడే!


విఠలేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే రోడ్డుదుస్థితి

మోమిన్‌పేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి శ్రీ విఠలేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. తేలిక పాటి వర్షానికే బురదమయంగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొన్ని రోజుల కిందట కాంట్రాక్టర్ సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాడు. అయితే పక్కనే మురుగు కాల్వ నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షాలకు మురుగు నీరు, మట్టి రోడ్డుపైకి వచ్చి బురదమయంగా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గుండెపోటుతో ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ మృతి


శ్రీనివాస్(ఫైల్)

తాండూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): తాండూరు ఎక్సైజ్ సర్కిల్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ సోమవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. మూడు రోజుల కిందట మహబూబ్‌నగర్‌కు వెళ్లిన ఆయన అక్కడ సోమవారం ఉదయం డ్యూటీకి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా ఛాతినొప్పితో ఇంట్లోనే కుప్పకూలిపోయారు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. శ్రీనివాస్ మూడేళ్లుగా తాండూరు ఎక్సైజ్ సర్కిల్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన అంత్యక్రియల నిమిత్తం వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ తరఫున ఇన్‌చార్జి సీఐ కె.శ్రీనివాస్ బాధిత కుటుంబానికి రూ.30వేలు అందజేశారు. అంత్యక్రియల్లో రాజిరెడ్డి, అనంతరెడ్డి, మురళి, బాలరాజు, దామాలనాయక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ముదిరాజ్ సంఘం నాయకులు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

బషీరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని నివాసంలో మైల్వార్ ముదిరాజ్ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు వారన్నారు. సంఘ భవనంతో పాటు ముదిరాజ్‌ల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నట్లు ఆ సంఘం అధ్యక్షులు నర్సింహులు, కె.నరేందర్ తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు టి.శామప్ప, జి.శేఖర్, ఎం.శామప్ప, ఈర్లపల్లి రాజు, భీంశంకర్, సురేష్, రాజు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మాసశివరాత్రి పూజలు

శామీర్‌పేట, మే 26 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేటలోని శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి ఆలయం(శివాలయం)లో ఆదివారం రాత్రి మాసశివరాత్రి ప్రత్యేకపూజలు ఘనంగా నిర్వహించారు. ప్రధానార్చకులు గడియారం మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో వేదబ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, మంత్రపుష్పం, అర్చన, తీర్థప్రసాద వితరణ చేశారు. శామీర్‌పేట, తూంకుంట, ఉప్పరిపల్లికి చెందిన భజన మండలి బృందాల ఆధ్వర్యంలో భజనలు చేశారు. అనంతరం భక్తుల సహకారంతో అన్నదానం చేపట్టగా భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

భగవద్గీత మానవ జాతికి మార్గదర్శకం

మేడ్చల్‌టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత యావత్తు మానవ జాతికి మార్గదర్శకమని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞాన వేదిక హైదరాబాద్ కమిటీ సభ్యులు అన్నారు. పట్టణంలోని కేఎల్ఆర్ కాలనీలో సోమవారం సభ్యులు భగవద్గీత ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సీహెచ్ గిరి ఎన్ఎస్.కుమార్, మధు, నర్సింహాచారి పాల్గొన్నారు.

తూతూమంత్రంగా ప్రజావాణి


మర్పల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం తూతూ మంత్రంగా కొనసాగుతోంది. మండల స్థాయి అధికారులు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఉన్నా అధికారులు ఆచరణలో పెట్టడం లేదు. మర్పల్లి మండలంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవోతో పాటు ఒకరిద్దరు అధికారులు మాత్రమే హాజరయ్యారు. సంబంధిత శాఖ అధికారులు లేకుండా సమస్యలపై ఎవరికి ఫిర్యాదు చేయాలని ప్రశ్నిస్తున్నారు.

బాల్యవివాహాలు, సైబర్ నేరాలపై అవగాహన

ధారూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ అనిత తెలిపారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సామాజిక అంశాలపై నిర్వహిస్తున్న కళాజాత కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని కేరెల్లి సత్యసాయి సార్వజనీక కేంద్రంలో ఏర్పాటు చేశారు. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా శిక్షింపబడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి సభ్యులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొబ్బరిపీచు ఫ్యాక్టరీలో మంటలు

- రూ.23లక్షల విలువ చేసే సామగ్రి దగ్ధం


దగ్ధమవుతున్న కొబ్బరి పీచు

ఘట్‌కేసర్ రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి పీచు ఫ్యాక్టరీలో మంటలు చెలరేగాయి. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సీఐ పరశురాం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి చెందిన రామతీర్థ చందుపట్లగూడలో గ్రీన్‌లైఫ్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో కొబ్బరి పీచు ఫ్యాక్టరీ నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. కొబ్బరిపీచుకు సులువుగా మంటలు అంటుకుని ఒక్కసారిగా ఎగిసిపడటంతో స్థానికులు రామతీర్థ, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ఫైర్‌సిబ్బందికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా తెలుస్తోంది. రూ.23లక్షల విలువ చేసే సామగ్రి దగ్ధమై నష్టం వాటిల్లిందని రామతీర్థ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్రైం కార్నర్

ప్రాణం తీసిన కుక్కకాటు


- కరిచిన రెండు నెలలకు మృతి


ప్రవీణ్ (ఫైల్)

పెద్దేముల్, మే 26(ఆంధ్రజ్యోతి): కరిచింది చిన్న కుక్కపిల్ల కదా అని ఆవ్యక్తి దానిని లైట్‌గా తీసుకున్నాడు. కుక్కకాటుకు వ్యాక్సిన్ వేయించుకోకుండా నిర్లక్ష్యం చేశాడు. ఫలితంగా ప్రాణాలే పోగొట్టుకున్నాడు. దీంతో అతడి కుటుంబం విషాదంలో మునిగింది. వివరాల్లోకి వెళ్తే.. మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.మండలంలోని ఇందూరు గ్రామానికి చెందిన కుంటల ప్రవీణ్(36)కు సుమారు రెండు నెలల కిందట చిన్న కుక్కపిల్ల కరిచింది. అయితే అది చిన్నకుక్క కదా అని కుక్కకాటును నిర్లక్ష్యం చేశాడు. కుక్కకాటుకు వ్యాక్సిన్ వేయించుకోలేదు. రెండు నెలలు గడిచింది. ఆదివారం నుంచి అనారోగ్యానికి గురైన ప్రవీణ్‌ను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం తాండూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యుడు ఏంజరిగిందని ఆరాతీయగా అతడు రెండు నెలల కిందట తనను కుక్కపిల్ల కరిచిన విషయం బయటపెట్టాడు. దీంతో వైద్యులు అన్ని రకాల వైద్యపరీక్షలు నిర్వహించగా రేబిస్ వ్యాధి సోకినట్లు గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం వెంటనే హైదరాబాద్ వెళ్లాలని సూచించారు. కుటుంబసభ్యులు హైదరాబాద్ తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రవీణ్ మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

బైక్ అదుపుతప్పి మహిళకు గాయాలు

- ప్రమాద స్థలంలోనే ప్రథమ చికిత్స


ప్రథమ చికిత్స చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

కోట్‌పల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): కోట్‌పల్లికి చెందిన బేగరి సుదర్శన్, మంజుల కోట్‌పల్లి నుంచి బైక్‌పై ఎన్నారం గ్రామానికి వెళుతుండగా లింగంపల్లి, ఎన్నారం సమీపంలో బైక్ అదుపుతప్పి పడిపోవడంతో మంజుల తల, మోకాలికి బలమైన గాయమైంది. అదేమార్గంలో వెళ్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొప్పుల రాజశేఖర్‌రెడ్డి తన కారులో ఉన్న ఎమెర్జెన్సీ మెడికల్ కిట్టును తీసి వెంటనే ప్రథమ చికిత్స చేసి తన వృత్తి ధర్మాన్ని నిర్వర్తించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వికారాబాద్ శారదా ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు రాజశేఖర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. ఆయన వెంట బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి, తదితరులు ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు


శామీర్‌పేట: ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

శామీర్‌పేట, మే 26 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి నిర్వాహకులను ఆదేశించారు. అలియాబాద్, శామీర్‌పేట్‌లో శామీర్‌పేట రైతు సహకార సంఘం, జిల్లా పౌరసరఫరాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించారు. ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం చేయొద్దన్నారు. రైతులకు బస్తాలను వెంటనే ఇచ్చి పంపించాలన్నారు. వరి ధాన్యాన్ని విక్రయించిన రైతులకు ఆలస్యం చేయకుండా నిబంధనల మేరకు బిల్లు డబ్బులను వారి బ్యాంకు ఖాతాలో జమచేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ యాదగిరిరెడ్డి ఉన్నారు.

'రైతులకు నష్టం కలిగిస్తే ఊరుకోం'

కులకచర్ల: రైతులను నష్టపర్చితే ఊరుకునేది లేదని బీజేపీ రాష్ట్ర నాయకుడు కరణం ప్రహ్లాద్‌రావు అన్నారు. మండలంలోని ముజాహిద్‌పూర్‌లో సోమవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడారు. అధికారులు వడ్లు తూకం వేయకుండా వాటిని మిల్లులకు పంపకుండా ఉండటంతో ధాన్యం వర్షానికి తడిసిందని రైతులు నష్టపోతున్నారని తెలిపారు. వెంటనే వడ్లు తూకం వేసి మిల్లులకు పంపకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గూడాల వెంకటేశ్, జిల్లా నాయకులు చంద్రలింగం, మోనాచారి, బిచ్చయ్య, మండల ప్రధాన కార్యదర్శి పోమాల నరేశ్, బీజేపీ ఉపాధ్యక్షుడు కొండా అంజి పాల్గొన్నారు.


ముజాహిద్‌పూర్‌లో కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రహ్లాద్‌రావు

రూ.26.77లక్షలకు తైబజార్ వేలం


తైబజార్‌కు వేలం నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

ఘట్‌కేసర్, మే 26 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని తైబజార్ నిర్వహణను రూ.26.77లక్షలకు కె.శ్రీనివాస్ వేలంలో దక్కించుకున్నాడు. పోచారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వీరారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వేలం పాటలో తొమ్మిది మంది పాల్గొన్నారు. ఇందులో శ్రీనివాస్ అత్యధికంగా పాడి తైబజార్లను దక్కించుకున్నాడు. 2025 మార్చి 31వరకు పోచారం మున్సిపాలిటీలోని తైబజార్లకు రూ.16.77లక్షలు, ఐదు విలీన పంచాయతీలకు రూ.8లక్షలు, మొత్తం రూ.26.77లక్షలకు తైబజార్ హక్కులను శ్రీనివాస్ కైవసం చేసుకున్నాడు. ఇందుకు గానూ రూ.25కు మించకుండా దుకాణదారుల నుంచి డబ్బులను వసూలు చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు నిర్మల, అశోక్, ఆర్‌వో కిరణ్ కుమార్, ఆర్ఐ సాయిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో రేపు మెగా జాబ్‌మేళా

ఘట్‌కేసర్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28న ఘట్‌కేసర్‌లోని ఐటీఎం డిగ్రీ కళాశాలలో నిర్మాన్ ఆర్గనైజేషన్ సహకారంలో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల యాజమాన్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ప్రముఖ ఫార్మా కంపెనీలు నాన్ ఐటీ, బ్యాకింగ్, ఇతర ఐదురకాలు పరిశ్రమలు వస్తున్నందున ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివినవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ర్యాలీ

మర్పల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌తో పాక్ గుండెల్లో గుబులు పుట్టించిన భారత సైనికులకు పాదాభివందనమని బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లేశ్‌యాదవ్, బల్‌రామ్‌గౌడ్, అన్నపూర్ణ, జంగం గోపాల్ పాల్గొన్నారు.

బీటీరోడ్డు పనులు ప్రారంభం

దోమ, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోన్యానాయక్ తండాకు రూ.కోటీ 26లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాములునాయక్, బంగ్లా యాదయ్యగౌడ్, రమేశ్‌గౌడ్, సూర్యనాయక్, శ్రీనివాస్, రాఘవేందర్ పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందించాలి

కొడంగల్ రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న దృష్ట్యా రైతులకు ఎరువులు, నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై అందించాలని సీపీఐ మండల కార్యదర్శి శ్యాంసుదర్ అన్నారు. ఆయన సోమవారం మాట్లాడుతూ.. వానాకాలం సీజన్ ప్రారంభం అవుతున్న సందర్భంగా నకిలీ విత్తనాలు విక్రయించే షాపులపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి వారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ

దౌల్తాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వ ఆదేశానుసారం ఎంఈవో వెంకటస్వామి సోమవారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నూతన పాఠ్యపుస్తకాలు, వంట పాత్రలు పంపిణీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం వంట పాత్రలు అందించినట్లు ఆయన తెలిపారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

దోమ, మే 26 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి అన్నారు. మండలంలోని మోత్కూర్ చెంచు కాలనీలో సోమవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాములునాయక్, బంగ్లా యాదయ్యగౌడ్, రమేశ్‌గౌడ్, గోన్యానాయక్, సురేశ్‌నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతితోనే అధిక దిగుబడి

మూడుచింతలపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతితోనే వరిసాగులో అధిక దిగుబడి పొందవచ్చునని డాక్టర్ పి.శ్రీదేవి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని అద్రాస్‌పల్లి, కేశవపూర్ గ్రామాల్లో సోమవారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రవి కుమార్, విద్యార్థులు, అను రైతులు, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

మేడ్చల్ టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడికి మాతృవియోగం

తాండూరు రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఇంట విషాదం నెలకొంది. ఉమ్మడి జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ సిరిగిరిపేట సాయిరెడ్డి, సతీమణి, తాండూరు మండల మాజీ వైస్ ఎంపీపీ అత్తగారు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వీరేందర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డిల తల్లి సిరిగిరిపేట నర్సమ్మ సోమవారం కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కుమారుడు వీరేందర్‌రెడ్డి నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆమె భౌతిక ఖాయాన్ని స్వగ్రామమైన కోట్‌బాస్పల్లిలోని ఇంటికి తరలించారు. మంగళవారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.